సాక్షి నిర్మల్

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



విజయం 'పది'లం చేసుకోండి

పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిడి.. భయం.. ఆందోళనను జయించాలి. 8లో▸



ఆర్జీయూకేటీ అభివృద్ధిపై సమీక్ష

బాసర ఆర్జీయూకేటీ అభివృద్ధిపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం క్యాంపస్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సమీక్ష నిర్వహించారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం 37.4 /21.3

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం భానుడి తీవ్రత అధికంగా ఉంటుంది. గాలిలో తేమ తగ్గుతుంది.. ఉక్కపోత పెరుగుతుంది.



రేషన్‌. ఇక బలవర్ధకం

- ఈనెల నుంచి ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ
- అంగన్‌వాడీలకూ 'ఎఫ్ఆర్‌కే' భోజనం
- ఇందులో ఐరన్, ఫోలిక్‌యాసిడ్ విటమిన్ బి12

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి రేషన్‌షాపుల ద్వారా బలవర్ధకమైన బియ్యాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఏప్రిల్ నుంచి పోషకాలతో కూడిన బియ్యం ఇవ్వడానికి సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 16 రైస్ మిల్లులు పోషకాల విలువలున్న బియ్యాన్ని తయారు చేస్తున్నాయి. జిల్లాలోని 412 రేషన్‌షాపుల్లో 2,08,686 రేషన్‌కార్డులు, 6,43,434 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ఈనెల నుంచి ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేయనున్నారు. దీని కోసం జిల్లాకు 3,465.80 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు.

ఇవీ తేడా..

సాధారణ బియ్యం 158 గ్రాముల్లో 45 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 4.3 గ్రాముల ప్రొటీన్స్, 0.6 గ్రాముల ఫైబర్, 0.4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి. పూర్తిస్థాయి పోషకాలు లభించక ప్రజల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఫోర్టిఫైడ్ బియ్యంలో విటమిన్, మినరల్స్‌ను కృత్రిమంగా కలుపుతున్నారు. ఐరన్, జింక్, అయోడిన్‌తోపాటు విటమిన్ ఏ, బీ1, బీ2, బీ3, బీ6, బీ9, బీ12, డీ, ఈ విటమిన్లు బియ్యంలో కలుపుతున్నారు. దీని కోసం ప్రత్యేకంగా రైస్‌మిల్లుల్లో బ్లెండెడ్ యంత్రాలు సమకూర్చుకున్నారు.

తయారీ ఇలా..

వంద కిలోల బియ్యానికి కిలో పోషకాల బియ్యం కెర్నల్ కలుపుతారు. ఇందులో ఐరన్ 28 మిల్లీ గ్రాముల నుంచి 42.5 మిల్లీ గ్రాములు, సోడియం ఐరన్ 14 మిల్లీ గ్రాముల నుంచి 21.25 మిల్లీ గ్రాముల మధ్య ఉంటే ఫోలిక్ యాసిడ్ 75 మైక్రో గ్రాముల నుంచి 125 మైక్రో గ్రాముల వరకు కలుపుతున్నారు. అలాగే విటమిన్ బీ12 ను 0.75 మైక్రో గ్రాముల నుంచి 1.25 మైక్రో గ్రాముల వరకు కలపడం ద్వారా జీవక్రియలకు అవసరమైన విటమిన్లు అందించే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా ప్రజలు రోగాలకు లోనుకాకుండా ముందస్తు నివారణలో భాగంగా పోషకాహారం అందించబోతున్నారు. బియ్యం బ్యాగులపై ఫోర్టిఫైడ్ రైస్ అని గుర్తువేస్తారు. పోషకాల బియ్యం అని తప్పని సరి సంచులపై ముద్రిస్తారు.



పోషకాలతో కూడిన బియ్యం బస్తా

వివరాలు..

చౌక ధరల దుకాణాలు 412
మొత్తం కార్డులు 2,08,686
లబ్ధిదారులు 6,43,434
జిల్లాలో నెలకు కేటాయించిన బియ్యం 3,276 మెట్రిక్ టన్నులు
అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాలకు సరఫరా చేస్తున్న బియ్యం : 189.8 మెట్రిక్ టన్నులు

పంపిణీకి ఏర్పాట్లు..



రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించే బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే రైస్ మిల్లుల నిర్వాహకులు బ్లెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేసుకొని సీఎంఆర్ బియ్యంలో ఎఫ్ఆర్‌కే బియ్యం కలిపి ప్యాకింగ్ చేసి సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతులు పొందారు. జిల్లాలోని 2.08 లక్షల మంది రేషన్ లబ్ధిదారులకు ప్రతి నెలా 3,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం.

– తనూజ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఈ నెల 5 నుంచి పంపిణీ..

పోషకాలు గల బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా ఏప్రిల్ 5 నుంచి పేదలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని రైస్ మిల్లర్లతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి మిల్లుల్లో బ్లెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్లెండింగ్ యంత్రాలను సమకూర్చుకున్న రైస్‌మిల్లర్లకే బియ్యాన్ని పంపిణీ చేసేందుకు అనుమతులివ్వనున్నారు. వందకిలోల సీఎంఆర్ బియ్యంలో కిలో ఎఫ్ఆర్‌కే(ఫోర్టిఫైడ్ రైస్ కర్నెల్) బియ్యాన్ని బ్లెండింగ్ యంత్రం ద్వారా కలిపి రైస్ మిల్లుల్లోనే ప్యాక్ చేసి రేషన్ దుకాణాలకు సరఫరా చేయనున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో 16 రైస్ మిల్లులకు సంబంధించి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం అనుమతులిచ్చింది. కిలోకు రూ.50 విలువ గల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంజాబ్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫోర్టిఫైడ్ బియ్యంతో భోజనాన్ని గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నారు.

అవినీతి రహితంగా పాలన

- కౌన్సిలర్ల ఆరోపణలు అవాస్తవం
- ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజేందర్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపాలిటీలో అవినీతి రహిత పాలన సాగిస్తున్నామని చైర్మన్ అంకం రాజేందర్ తెలిపారు. అవినీతి పెరిగిందని కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. స్థానిక మున్సిపల్ చాంబర్‌లో శుక్రవారం మాట్లాడారు. కలెక్టర్ పర్యవేక్షణ లేకుండా మున్సిపాలిటీలో బిల్లులు చెల్లించొద్దని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సైతం ఎప్పటికప్పుడు నిబంధనల మేరకే పనులు చేపడుతున్నారన్నారు. మిషన్ భగీరథ పనులకు సంబంధించి ఆయా కాలనీల్లో సక్రమంగా పనులు జరిగాయని కౌన్సిలర్లు ఇచ్చిన క్లియరెన్స్ మేరకే బిల్లులు చెల్లించామన్నారు. సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించి రూ.12 లక్షలను ఉన్నతాధికారుల ఆదేశంతోపాటు సంబంధిత జీవో ప్రకారమే చెల్లించామన్నారు. మున్సిపాలిటీ నిధులన్నీ సక్రమంగానే వినియోగిస్తున్నామన్నారు.

కలెక్టర్‌కు బడ్జెట్ సమావేశం వివరాలు..

పట్టణంలో ఇప్పటి వరకు ఐదోసారి మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశాలు ఏర్పాటు చేశామని కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఐదో సమావేశానికి సభ్యుల హాజరు వివరాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డికి నివేదిస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్లు బడ్జెట్ సమావేశానికి హాజరై, సంతకాలు చేసినందున బడ్జెట్ ఆమోదం పొందినట్టేనని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌దే తుది నిర్ణయమన్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి రూ.7.32 కోట్ల గ్రాంటు 2023–24 సంవత్సరానికి అంచనా ఆదాయంగా ఉందన్నారు. మున్సిపాలిటీలో పన్నులు, అసైన్డ్ రెవెన్యూ ఆదాయం, పన్నేతర ఆదాయం ద్వారా 2023–24 సంవత్సరం అంచనా ఆదాయం రూ.206 కోట్లు ఉందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ కారింగుల సంకీర్తన, కోఆప్షన్ సభ్యుడు బండారి కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్లుగా కుంటుపడుతున్న అభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ వైఫల్యం కారణంగా మూడేళ్లుగా ఖానాపూర్ పట్టణం అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతోందని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఆరోపించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఐదోసారి జరిగిన బడ్జెట్ సమావేశానికి హాజరైనప్పటికీ బడ్జెట్ ఆమోదంపై చర్చించకుండా బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. చైర్మన్‌తోపాటు కమిషనర్ల వైఫల్యం కారణంగా మూడేళ్లుగా బడ్జెట్ వ్యయం, ఖర్చుల వివరాలను కౌన్సిలర్లకు కూడా తెలియజేయడం లేదన్నారు. ఖర్చులను చూపకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సుమారు రూ.8 కోట్లతో చేపట్టిన మిషన్‌భగీరథ పనులకు అధికారులు బిల్లులు చెల్లించినప్పటికీ పనులు పూర్తిగా అసంపూర్తిగా జరిగాయని తెలిపారు. పట్టణంలో ఎన్నో సమస్యలు ఉన్నా పట్టణ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మున్సిపాలిటీకి వచ్చే నిధులను చైర్మన్, కమిషనర్ దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. సెంట్రల్ లైటింగ్ పనులకు ప్రత్యేక ఫండ్ ఉన్నా కేవలం కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్ల కోసం మున్సిపల్ ఫండ్ నుంచి రూ.12 లక్షలు చెల్లించారని తెలిపారు. రోడ్డు వైడింగ్ పనుల్లో జాప్యం కారణంగా ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తైబజార్ ద్వారా మున్సిపల్ సిబ్బందితో లక్షల రూపాయలు వసూలు చేయించి కేవలం వేల రూపాయలు మాత్రమే మున్సిపల్ ఖాతాలో జమచేశారని తెలిపారు. వీధి దీపాల మెయింటనెన్స్ ఏజెన్సీతో కాకుండా మున్సిపల్ సిబ్బందితో చేయిస్తున్నా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. మూడేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, పట్టణంలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తాము మున్సిపల్ బడ్జెట్ ఆమోదానికి వ్యతిరేకంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కలీల్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు పరిమి లత, నాయిని స్రవంతి, కావలి సంతోష్, జన్నారపు విజయలక్ష్మి, తొంటి శ్రీనివా స్, ఫౌజియాబేగం పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం బయట కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

న్యూస్‌రీల్

ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా చూడాలి



కలెక్టర్‌కు వివరణ ఇస్తున్న పోలీసులు..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా చూడాలని, ఈమేరకు నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణ కంపెనీ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేయించి సిగ్నల్స్ పనిచేసేలా చూడాలన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ ఉన్నారు.

ఒండ్రు మట్టి తరలింపుతో నీటి నిల్వ పెంపు



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శేఖర్‌రెడ్డి

లోకేశ్వరం: చెరువుల్లో పూడిక తీయడం, ఒండ్రు మట్టి తరలింపు ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ నిర్మల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుమన్ కుమార్ అన్నారు. మండలంలోని మన్మద్ గ్రామంలోని దేవుడు చెరువులో అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో మన ఊరు–మన చెరువు–మన మట్టి సంకల్పంతో జల పునరుజ్జీవన పథకం (రిస్టోర్ ప్రామిస్ ఆఫ్ వాటర్) కింద రైతుల భాగస్వామ్యంతో మట్టి తరలింపు కార్యక్రమాన్ని సర్పంచ్ శేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ చెరువు పూడిక తీయడం వల్ల చెరువు శిఖం(నీటి నిల్వ ప్రాంతం)లోతు పెరిగి ఆయకట్టు కింద భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. చెరువులోని మట్టిని రైతుల చేలకు తరలిస్తే భూసారం పెరిగి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేశ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్న భోజారెడ్డి, రైతులు భూమన్న, లక్ష్మణ్, కర్రెన్న, భోజారెడ్డి, అరణ్య సంస్థ సిబ్బంది గణేశ్, శంకర్ పాల్గొన్నారు.

ఐక్యతకు నిదర్శనం ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నాయకులు

పెంబి: మత సామరస్యానికి, ఐక్యతకు ఇఫ్తార్ విందులు నిదర్శనమని ఏఐసీసీ రీసెర్చ్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని మజీదులో ముస్లింలకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినోద్‌నాయక్ మాట్లాడుతూ.. ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకునేలా మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిర్వహించడం వలన సోదరభావంతో మెలిగేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నిల్‌రెడ్డి, నాయకులు శంకర్, ముస్లింలు ఇస్మాయిల్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ 'స్పాట్' ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ కేంద్రం నిర్వహిస్తున్నారు. జిల్లాకు వివిధ జిల్లాల నుంచి 3లక్షల జవాబు పత్రాలు రానున్నట్లుగా డీఐఈవో రవీందర్ కుమార్ తెలిపారు. తొలివిడత శుక్రవారం నుంచి, రెండో విడత ఈనెల 4నుంచి, మూడో విడత 6వ తేదీ, నాలుగో విడత 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు ఆయన తెలిపారు.

స్త్రీనిధి లక్ష్యంలో ముధోల్ టాప్

- రాష్ట్రంలోనే ప్రథమ స్థానం
- వందశాతం రికవరీతో నిర్మల్ జిల్లా రెండోస్థానం



అవార్డు అందుకుంటున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసాటౌన్: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తోంది. స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేస్తోంది. మండల సమాఖ్యల ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందించడంతోపాటు రికవరీ చేస్తోంది. ఇందులో భాగంగా రుణాల లక్ష్యంతోపాటు రికవరీలో ప్రతిభ కనబర్చిన సమాఖ్యను ఎంపిక చేసి ఏటా పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో అవార్డులు అందిస్తున్నారు.

రాష్ట్రంలోనే ముధోల్ టాప్...

జిల్లాలోని ముధోల్ మండల సమాఖ్య రుణాల అందజేతతోపాటు రికవరీలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికిగాను రుణ లక్ష్యాన్ని మించి సాధించడంతో రాష్ట్రస్థాయిలో అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు, డీఆర్డీవో విజయలక్ష్మి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరం రూ.4.56 కోట్ల రుణ లక్ష్యానికిగాను రూ.6.63 కోట్ల రుణాలు అందించడంతోపాటు రికవరీలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది.

రికవరీలో రెండోస్థానంలో జిల్లా..

జిల్లాలో 25 మండల సమాఖ్యలకు 2021–22 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.83.03 కోట్ల రుణాల అందజేత లక్ష్యం ఉండగా, రూ.87.82 కోట్లు రుణాలు అందించారు. రుణాల అందజేతలో వందశాతానికిపైగా లక్ష్యం సాధించింది. అలాగే రికవరీలో సైతం వందశాతం లక్ష్యం చేరుకుని జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచింది.

అందరి సహకారంతోనే...

స్త్రీనిధి రుణాల లక్ష్యంలో నిర్మల్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. అలాగే రుణాల అందజేత, రికవరీతోపాటు స్వయం ఉపాధియూనిట్ల మంజూరు వంటి కార్యకలాపాలతో ముధోల్ మండల సమాఖ్య రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడం గర్వంగా ఉంది. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది, అందరి సహకారంతోనే ఇది సాధ్యమైంది.

– విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసాటౌన్: భైంసా ఏరియాస్పత్రిలో చేపట్టిన మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఏరియా ఆస్పత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. నర్సులు, వైద్యసిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్య కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులు పరిశీలించారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న బస్తీ దవాఖా నాను పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ కాశీనాథ్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

కోల్డ్ స్టోరేజీ స్థలం పరిశీలన..

భైంసారూరల్: మండలంలోని దేగాంలో కోల్డ్‌స్టోరేజీ నిర్మించనున్న స్థలాన్ని కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. డీఆర్డీవో ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కోల్డ్ స్టోరేజీకి భారీ లోడ్‌తో వచ్చే వాహనాల కోసం రోడ్డు ఉండేలా చూడాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి సూచించారు. తర్వాత గ్రామంలోని శనగ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలన్నారు. అనంతరం సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, సర్పంచు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముధోల్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ముధోల్: మండల కేంద్రంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముధోల్ శివారులో రైతు సాగు చేసిన ఆయిల్‌పాం తోటను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముధోల్‌లో ప్రభుత్వ గిరిజన వసతిగృహం తనిఖీ చేశారు. 10వ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చాలని సూచించారు. హాస్టల్ స్టోర్‌రూంను పరిశీలించి పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రిన్సిపాల్ పద్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం నిల్వల్లో తేడా గుర్తించారు. పనితీ రు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం ప్ర భుత్వ సామాజిక ఆస్పత్రిని తనిఖీ చేసి పలు వివరా లు డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో సురేశ్‌బాబు, ఆర్ఐ అభిమన్యు ఉన్నారు.



తెప్పోత్సవంలో భక్తులు

శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీలోని సీతారామచంద్రస్వామివారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను డప్పు చప్పుళ్లతో మహిళల మంగళహారతుల నడుమ గోదావరి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నదీ తీరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు గోదావరికి హారతి ఇచ్చారు. తర్వాత కోదండరామయ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెంబి జెడ్పీటీసీ జానుబాయి, సతీశ్‌రావు దేశ్‌పాండే, వెంకటేశ్వర్లు, లాందేరి కిషన్, డబ్బు శ్రీనివాస్, అయిందాల జనార్దన్, పాదం రాకేశ్, పెరిక గంగాధర్ పాల్గొన్నారు.

– ఖానాపూర్



మంగళహారతులతో ఊరేగింపుగా గోదావరికి వెళ్తున్న మహిళలు



గోదావరికి హారతి ఇస్తున్న పండితులు

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ రూరల్: ఈనెల 3 నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారులతో శుక్రవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తికి కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. 90599 87730 నంబర్‌కు ఫోన్‌చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను అనుమతించమని స్పష్టం చేశారు. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఈనెల 13 వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 9,078 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి సరిగా పనిచేస్తున్నాయో లేదో సరి చూసుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి ప్రశ్నపత్రాల తరలింపునకు పోలీస్ బందోబస్తు ఏర్పాటుతోపాటు 144 సెక్షన్ విధించాలని తెలిపారు. జిరాక్స్ సెంటర్లు మూసిఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు, సైన్స్ పరీక్ష మినహాయించి ప్రతీ పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు, సైన్స్ పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతాయని వివరించారు. పరీక్ష హాల్‌లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, గాడ్జెట్స్ తీసుకువెళ్లడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. జూమ్ మీటింగ్‌లో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ

- సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రాన్ని గద్దె దించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి దేశ సంపదను అదాని, అంబానీలకు తాకట్టు పెడుతోందని ఆరోపించారు. కార్మికుల హక్కులు కాలరాసే విధంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పేద ప్రజలకు సేవలు అందిస్తున్న 72 రకాల స్కీంలను ప్రైవేటీకరణ చేసే దిశగా కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలను కార్పొరేట్ చేతుల్లో పెడుతోందని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఉపాధి హామీ పథకానికి ఈ ఏడాది కేంద్రం తక్కువ నిధులు కేటాయించిందని తెలిపారు. కార్మికుల పనిదినాలు తగ్గిస్తూ, కూలీ రేట్లు తగ్గిస్తూ, కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, ఉపాధ్యక్షురాలు శైలజ, శశికళ, హేమలత, నర్సమ్మ, లావణ్య, రమ్య, భాగ్య పాల్గొన్నారు.

ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

లక్ష్మణచాంద మండలంలో ఒకేసారి ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. కనకాపూర్, వడ్యాల్ శివార్లలోని ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి అందులోని కాపర్‌వైర్ ఎత్తుకెళ్లారు.

– వివరాలు 8లో▸

క్లుప్తంగా

రైలు కిందపడి వృద్ధుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్/తలమడుగు: రైలు కిందపడి వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని మార్వాడి భవన్‌లో పటేల్ సర్దార్‌భాయ్ (63) వాచ్‌మన్‌గా పని చేసేవాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయి గ్రామాల్లో తిరుగుతున్నాడు. శుక్రవారం తలమడుగు మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడికి కుటుంబ సభ్యులెవరూ లేరని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కామోల్‌లో కుస్తీ పోటీలు



తలపడుతున్న మల్లయోధులు

భైంసారూరల్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మండలంలోని కామోల్ గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. తొమ్మిది రోజులుగా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుండగా శనివారం సీతారాముల కల్యాణంతో ముగియనున్నాయి. శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీల్లో అధికసంఖ్యలో మల్లయోధులు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

లేడీస్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిన పూజ గది

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోగల రాదే రాదే వుమెన్స్ హాస్టల్‌లో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హాస్టల్‌లోని ఓ గదిలో పూజకు వెలిగించిన దీపం నిప్పురవ్వలతో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు ఫైరింజన్‌తో వచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. భవనానికి సరైన ఫైర్‌సేఫ్టీ లేదని అగ్నిమాపకశాఖ అధికారి కేశవులు తెలిపారు. ఐదంతస్తుల భవనంలో బయటకు వెళ్లడానికి దారులు కూడా సక్రమంగా లేవన్నారు. ఒక అంతస్తులో బాలికల హాస్టల్ ఉండగా, మరో అంతస్తులో పాత సామగ్రి నిల్వ చేశారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం ఉందని పేర్కొన్నారు. ఇక్కడున్న బాలికలు వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. సరైన సమయంలో మంటలు ఆర్పివేయగా ప్రాణనష్టం జరగలేదని వివరించారు. మంటలు ఆర్పిన వారిలో ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ శివాజీ, అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

అగ్నికి ఆహుతైన పల్లె పార్కు



పార్కులో కాలిపోయిన మొక్కలు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారి–44 పక్కనే ఉన్న పార్కు శుక్రవారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. మొక్కల అడుగు భాగంలో ఎండిన గడ్డి ఉండడంతో పార్కు అంతటా మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ జాదవ్ సునీత పంచాయతీ సిబ్బందితో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికీ మొక్కలు కాలిపోయాయి. ఉపాధిహామీ కింద ఏర్పాటు చేసిన ఈ పార్కుకు ఏడాదిపాటు వాచ్ అండ్ వార్డు నిధులు అందించారు. రెండేళ్లుగా పార్కు బాధ్యతలు ఎవరూ తీసుకోకపోవడంతో మొక్కలు నీరు అందడంలేదు.

విజయం 'పది'లం చేసుకోండి



నెన్నెల హైస్కూల్‌లో తరగతిగదిలో చదువుతున్న విద్యార్థులు

- ఈ నెల 3వ తేదీ నుంచి ఎస్సెస్సీ పరీక్షలు
- హాజరుకానున్న 36,953 మంది విద్యార్థులు
- పౌష్టికాహారం, సరిపడా నిద్ర తప్పనిసరి.. భయం వీడాలంటున్న వైద్య నిపుణులు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మంచిర్యాల జిల్లాలో 10,125, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 7,051, నిర్మల్‌లో 9,078, ఆదిలాబాద్ జిల్లాలో 10,699 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిడి.. భయం.. ఆందోళనను జయించాలంటే సానుకూలమైన ఆలోచనలు.. ప్రణాళిక బద్ధమైన సంసిద్ధత, ఆత్మవిశ్వాసం, విషయాన్ని సూటిగా స్పష్టంగా వ్యక్తీకరించడం అవసరం. మానసిక ప్రశాంతత.. ప్రణాళిక ప్రకారం సాధన చేయడం, మంచి ఆహారపు అలవాట్లు, సంపూర్ణ ఆరోగ్యంతో పరీక్షలకు సిద్ధమైతే విజయం సొంతమై లక్ష్యాన్ని చేరుకుంటారు. ఈనేపథ్యంలో వైద్యులు, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

భయం వీడి పరీక్ష రాయండి



తల్లిదండ్రులు పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. పిల్లలను టీవీలకు దూరంగా ఉంచాలి. విద్యార్థులు భయం వీడి పరీక్ష రాయాలి. సంవత్సరం పాటు నేర్చుకున్న విషయాలను మాత్రమే సమాధాన పత్రంలో రాస్తామన్న భావనతో ఉండాలి. ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా పరీక్షలకు హాజరు కావాలి. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే మంచిది.

– ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లిన దగ్గరి నుంచి పరీక్ష రాసి తిరిగి వచ్చేవరకూ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి ప్రశ్నలకు జవాబులు రాయాలి. పరీక్షల వేళ టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. పిల్లలు ఏమి చదువుతున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

– బాపు, పేరెంట్

ఆహారం విషయంలో నిర్లక్ష్యం వద్దు



పరీక్షల ధ్యాసలో పడి ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయరాదు. కూరగాయలు, పప్పుదినుసులు, పాలు, ఆకుకూరలు, పీచు పదార్థాలు ఉండే పండ్లు తినాలి. కాఫీలు, కూల్‌డ్రింక్స్, తేనీరు ఎక్కువగా తీసుకోకూడదు. రోజుకు 8గంటల నిద్రపోవడం ఎంతో ముఖ్యం. ఆయిల్, మసాలాతో కూడిన ఆహారం తినరాదు. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, బట్టర్‌మిల్క్ తీసుకోవాలి. రోజుకు 4–5 లీటర్ల నీళ్లు తాగాలి. వదులుగా ఉండే లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ రవికుమార్, జనరల్ ఫిజీషియన్ (ఎండీ)

ఒత్తిడిని జయించేందుకు భరోసానివ్వాలి



పరీక్షలు అనగానే విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారు. ధ్యానం, యోగా చేయాలి. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలి. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భరోసా కల్పించాలి. స్థాయికి మించిన అంచనాలు పక్కన పెట్టాలి. సానుకూల దృక్పథం కలిగి ఉండాలి. భావోద్వేగాలకు దూరంగా ఉండాలి. ఫలితాలతో సంబంధం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తే లక్ష్యం చేరుకుంటారు.

– డాక్టర్, సునీల్‌కుమార్, మానసిక వైద్యనిపుణుడు

పుస్తకాన్ని సరైన ఎత్తులో ఉంచి చదవాలి



మెడ, నరాల నొప్పి రాకుండా ఉండేందుకు విద్యార్థులు పుస్తకాలను సరైనా ఎత్తులో పెట్టి చదువుకోవాలి. ఒత్తిడికి లోనుకావద్దు. ఎక్కువ సేపు చదవడం, నిద్రలేమి కారణాలతో ఆరోగ్యం దెబ్బతింటుంది. మొబైల్ అతి వినియోగం మానుకోవాలి. చదువు మధ్యలో షార్ట్ బ్రేక్ ఇవ్వాలి. రోజూ వాకింగ్, వ్యాయామం చేయాలి. పుస్తకాన్ని తలకు సరైన ఎత్తులో పెట్టుకుని చదువుకోవాలి. సరైన నీరు, పోషకాహారం తీసుకోవాలి.

– వీ అరుణ్‌శేషు, న్యూరాలజిస్ట్, మంచిర్యాల

ప్రశాంతంగా చదువుకోవాలి



పరీక్షలు ఏవైనా విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా తల్లిదండ్రులు సహకరించాలి. పరీక్షల సమయంలో స్నాక్స్, రాగిజావ అందించాలి. ఒత్తిడికి గురైతే చదివింది కూడా మరిచిపోయే అవకాశం ఉంటుంది. ఇతర పిల్లలతో తమ పిల్లలను పోల్చడం మానుకోవాలి. విద్యార్థులకు పరీక్షలప్పుడు ఏమి కావాలో తెలుసుకుంటూ వాళ్ల అవసరాలను తీరుస్తుండాలి.

– బండి మధుకర్, పేరెంట్, పొక్కూర్

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న

కుభీర్: మండల కేంద్రానికి చెందిన రైతు దనగరి దత్తుకు చెందిన ఎకరన్నర మొక్కజొన్న కుప్పలు శుక్రవారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న బాధిత రైతు ఘటన వద్దకు వెళ్లి మంటలు ఆర్పగా అప్పటికే సుమారు రూ.80వేల విలువైన పంట కాలిపోయింది. ప్రభుత్వం పరిశీలించి పరిహారం ఇప్పించాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఇంద్రాదేవి ఆలయంలో చైత్రమాస పూజలు



ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రాదేవి ఆలయంలో చైత్రమాస పూజలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మండలంలోని దేవాపూర్, పిప్రి గ్రామాలకు చెందిన ఆదివాసీలు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. నెలపాటు ఆలయంలో పూజలు జరుగుతాయని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులు వచ్చి పూజలు చేస్తారని ఆలయ మహారాజ్ చహకటి సూర్యరావ్ తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చహకటి నాగోరావ్, జుగ్నాక్ భరత్, సోయం భీం రావ్, ఆత్రం కాశీరాం తదితరులున్నారు.

పాఠశాల ఎదుట హనుమాన్ భక్తుల ఆందోళన

- దీక్షలో ఉన్న విద్యార్థులను ఇంటికి పంపడమే కారణం
- క్షమాపణ చెప్పిన యాజమాన్యం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



కరస్పాండెంట్‌తో మాట్లాడుతున్న హనుమాన్ భక్తులు

ఉట్నూర్: హనుమాన్ దీక్ష స్వీకరించిన విద్యార్థులను పాఠశాల నుంచి ఇంటికి పంపిన ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తీరు వివాదాస్పదమైంది. మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమాన్ భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని సెయింట్ పాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఇటీవల హనుమాన్ దీక్ష స్వీకరించారు. మూడురోజుల క్రితం పాఠశాలకు వచ్చిన వీరిని దీక్షలో ఉండగా బడికి రావద్దని నిర్వాహకులు ఇంటికి పంపించారు. రెండురోజులుగా వీరు పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు ఆరా తీశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక హనుమాన్ దీక్షాపరుల దృష్టికి విషయం తీసుకువెళ్లారు. దీంతో వారు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. కరస్పాండెంట్ దీనా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే హనుమాన్ చాలీసా పఠించారు. సమాచారం అందుకున్న సీఐ సైదారావ్ సిబ్బందితో పాఠశాలకు చేరుకుని పాఠశాల యాజమాన్యంతో క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. దీక్షలో ఉన్న విద్యార్థులు కూడా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఐటీడీఏ డీడీ డాక్టర్ దిలీప్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

ఆదిలాబాద్‌రూరల్: పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థుల ఆరోగ్యంపై సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ డీడీ డాక్టర్ దిలీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్, బోథ్ డివిజన్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు నివాసముండే చోట ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. బాలికలు పరీక్ష కేంద్రానికి వెళ్లేటప్పుడు అదనంగా మహిళా ఉపాధ్యాయురాలిని సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థుల బయోమెట్రిక్‌ను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారి తీరు మారాలని సూచించారు. పరీక్ష కేంద్రం అందుబాటులో లేని విద్యార్థులను కాలినడకన కాకుండా వాహనాల్లో తరలించాలని, వారికి ట్రాన్స్‌పోర్ట్ చార్జీ కూడా అడ్వాన్స్‌గా ఇచ్చినట్లు చెప్పారు. కండిషన్‌లో ఉన్న వాహనాలను సమకూర్చుకోవాలని, వాహన డ్రైవర్ పూర్తి వివరాలు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన మెనూను పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులో వెనుకబడి ఉండవద్దనే ఉద్దేశంతో ప్రత్యేకంగా తీసుకువచ్చిన అక్షరజ్యోతి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. సీ, డీ గ్రేడ్‌లో ఉన్న వారిని ఏ, బీ గ్రేడ్‌లకు తీసుకురావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొలాం ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేశారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే కార్పొరేట్ కళాశాలలో ప్రవేశం కల్పిస్తామని సూచించారు. సమావేశంలో ఏసీఎంవో జగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఏటీడీవోలు సౌజన్య, నిహారిక పాల్గొన్నారు.

'రాహుల్ సభ్యత్వం పునరుద్ధరించాలి'



మాట్లాడుతున్న గద్దం వినోద్

నిర్మల్‌రూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయించిందని మాజీ మంత్రి జీ వినోద్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడోయాత్రతో దేశంలో కదలిక మొదలైందని, కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను తట్టుకోలేక కేంద్రం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. భేషరతుగా రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క యాత్రలు విజయవంతంగా సాగుతున్నాయని చెప్పారు. వ్యక్తిగత కారణాలతో తాను పాల్గొనలేకపోయానని వివరించారు. పాదయాత్రకు మంచి స్పందన వస్తోందని, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు ఆనంద్‌పటేల్, డీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన వీసీ, డైరెక్టర్

భైంసా: బాసర ఆర్జీయూకేటీ అభివృద్ధిపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి శుక్రవారం క్యాంపస్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సమీక్ష నిర్వహించారు. వర్సిటీలో కార్యక్రమాలు, కార్యాచరణ, అమలు గురించి వివిధ శాఖల అధికారులతో చర్చలు జరిపారు. విద్యార్థులకు సెలవులు ప్రకటించిన సమయంలో బస్సులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యుత్, మంచినీటి సమస్యపై చర్చించారు. విద్యార్థుల కోసం వాకింగ్ ట్రాక్ నిర్వహించాలని సూచించారు. అడవి జంతువులపై అవగాహన, పక్షులపై ఫొటోగ్రఫీ శిక్షణ, బయో డైవర్సిటీ విధానాన్ని అమలు పరచడం, ఫొటోగ్రఫీ క్లబ్, కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడం, నేచర్ క్లబ్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. విద్యార్థులకు రైల్వేలో 50 శాతం రాయితీతో ప్రయాణం చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో మార్గ్ సాఫ్ట్‌వేర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అన్ని విభాగాల అధికార యంత్రాంగం, ఆర్జీయూకేటీ వివిధ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ, ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్స్, పీఆర్వో డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీ రంగస్వామి, ఎస్సై రాహుల్ గైక్వాడ్

లక్ష్మణచాంద: మండలంలో ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కనకాపూర్, వడ్యాల్ శివార్లలోని ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి అందులోని కాపర్‌వైర్ ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన రైతులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించారు. ఐదు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు తెలిపారు. విద్యుత్ ఏఈ మహేశ్ సమాచారం మేరకు ఏడీ రంగస్వామి ఘటనా స్థలాలకు చేరుకుని ఏఈ, ఏఏఈ మధు, ఎస్సై రాహుల్ గైక్వాడ్‌తో కలిసి పరిశీలించారు. వీటి విలువ రూ.5.50 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. దీనిపై కనకాపూర్, వడ్యాల్ రైతుల నుంచి రెండు ఫిర్యాదులు రాగా రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గోదావరి నదిలో బాలుడి మృతదేహం

ముథోల్: లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరినది వంతెన వద్ద మండలంలోని బోరిగా గ్రామానికి చెందిన బాలుడి మృతదేహం లభించింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోరిగా గ్రామానికి చెందిన మంచువార్ సాయిచరణ్ (14) దిలావర్‌పూర్ బీసీ హాస్టల్‌లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శివరాత్రి పండుగకు ఇంటికి వచ్చి అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. హాస్టల్‌కు వెళ్లాలని తండ్రి లింగం మందలించగా బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ లభించకపోవడంతో లింగం ముథోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరి నది వంతెన వద్ద సాయిచరణ్ మృతదేహం లభించింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సంఘాల పేరు.. వ్యాపారం జోరు



టీఎన్జీవోస్ భవనం



ఎస్టీయూ భవన్



విద్యుత్ ఉద్యోగుల సంఘ భవనం



రెవెన్యూ గార్డెన్



పీఆర్టీయూ భవన్

సభలు, సమావేశాల నిర్వహణకు వీలుగా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల కోసం స్థలాలు కేటాయించింది. భవన నిర్మాణాలకు నిధులివ్వగా జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ, ఎస్టీయూ, రెవెన్యూ, టీఎన్జీవోస్, విద్యుత్ ఉద్యోగుల సంఘాల భవన నిర్మాణాలు చేపట్టగా ప్రస్తుతం వీటి విలువ రూ.కోట్లలో ఉంటుంది. కాగా, ఈ భవనాలను ఫంక్షన్‌హాళ్లుగా మార్చి వ్యాపారులకు లీజుకిస్తున్న సంఘాలు రూ.లక్షలు గడిస్తున్నాయి. కాగా, బల్దియాకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు మాత్రం చెల్లించకపోవడం గమనార్హం. వీధి వ్యాపారులను ముక్కుపిండి ఫీజు వసూలు చేస్తున్న అధికారులు ఈ సంఘాల వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్